# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 169 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8 వెల రూ. 2 ఆదివారం -20 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై భారత్ స్థానం మరింత బలోపేతం!


2లో

- బ్రిక్స్ సదస్సు నిర్వహణలో భారత దౌత్యంపై డైరెక్టస్ ప్రత్యేక నివేదిక
- పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించడంతో భారత వాదనలకు లభించిన మద్దతు
- క్వాడ్‌లో ఉంటూనే బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు 'డైరెక్టస్' ప్రస్తావన
- అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తూ రష్యాతో భాగస్వామ్యం కీలకమని వ్యాఖ్య

## పాక్ కదలికలపై ఇక 24 గంటల నిఘా.. ఈఓఎస్-05తో మారనున్న పరిస్థితులు?


2లో

### ఈఓఎస్-05తో ఉపఖండంపై నిరంతర నిఘా సాధ్యమన్న నివేదిక

- పాక్ సైనిక కదలికలను గమనించే సామర్థ్యం పెరగనుందని వెల్లడి
- ఈఓఎస్-05ను సెప్టెంబర్ 4న భూస్థిర కక్ష్యలోకి పంపిన భారత్
- వ్యూహాత్మక సమాచారాన్ని అందించనున్న ఉపగ్రహం
- నిరంతర నిఘాతో వేగవంతం కానున్న లక్ష్యాల గుర్తింపు


2లో

## మరోసారి యూరప్ పర్యటనకు జగన్.. షరతులతో సీబీఐ కోర్టు అనుమతి

- కుటుంబంతో కలిసిన యూరప్ పర్యటనకు వెళ్లనున్న జగన్
- 15 రోజుల పర్యటనకు సమ్మతి తెలిపిన నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు
- ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీ వివరాలను ఇవ్వాలని కోర్టు ఆదేశం

## మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

కొప్పర్తి-కడప బైపాస్ రహదారికి రూ. 304 కోట్లు కేటాయించిన కేంద్రం



2లో

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోందన్న పవన్ కల్యాణ్
- ఈ ప్రాజెక్టు కారణంగా రాయలసీమలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని వెల్లడి

# అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించండి

### రాష్ట్రవ్యాప్తంగా 513 మండలాల్లో కరవు ఛాయలు ఉన్నట్టు ప్రాథమిక అంచనా

- ★ సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ★ పంట నష్టాన్ని నివారించి, సూక్ష్మ సేద్యం, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని సూచన
- ★ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, విశాఖపై ప్రత్యేక కార్యాచరణకు ఆదేశం
- ★ ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశం
- ★ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష




అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడా పంట నష్టం జరగకుండా, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన మిగతా 2 లో


2లో

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

## విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'.. 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ

### లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

- విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- పేద ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు
- పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను మిగతా 2 లో

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

### 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ

- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన



ఢిల్లీ: దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని మిగతా 2 లో


2లో

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

### ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోంది

- ★ తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం
- ★ ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే
- ★ విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం



హైదరాబాద్: వరంగల్ ఎయిర్ పోర్టు కు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప.. వరంగల్ విమానాశ్రయం సాధించటంపై మిగతా 2 లో

## వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారు: కిషన్ రెడ్డి


2లో

- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అన్న కిషన్ రెడ్డి
- గతంలో సబిత, తలసాని రాజీనామా చేయకుండానే కేసీఆర్ వారికి మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపాటు
- భూదందాలు, అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయని విమర్శ

హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు

# బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై భారత్ స్థానం మరింత బలోపేతం!

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత అంతర్జాతీయ వేదికపై భారత్‌కు దౌత్యపరమైన ప్రాధాన్యం మరింత స్పష్టమైందని 'డైరెక్టస్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో తీవ్రంగా ఖండించడం, సరిహద్దు దాటి ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, సురక్షిత స్థావరాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవడం భారత్ చాలాకాలంగా ప్రస్తావిస్తున్న అంశాలకు మద్దతు లభించినట్లయిందని తెలిపింది. పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నేరపూరితమైనదిగా, సమర్థించలేనిదిగా పేర్కొన్నాయి. ఉగ్రవాద చర్యలకు పాల్పడినవారితో పాటు వారికి మద్దతు ఇచ్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా డిక్లరేషన్ స్పష్టం చేసింది. అయితే డిక్లరేషన్‌లో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ అంశాన్ని దాచాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అతిగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని 'డైరెక్టస్' పేర్కొంది. వివిధ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న దేశాలు కలిసి ఉగ్రవాదంపై ఇలాంటి భాషను అంగీకరించడం భారత్‌కు దౌత్యపరంగా ముఖ్యమైన పరిణామమని విశ్లేషించింది. ఉగ్రవాదాన్ని కేవలం దాడి చేసిన వ్యక్తితో మాత్రమే పరిమితం చేయలేమని నివేదిక పేర్కొంది. ఆయుధాలు, శిక్షణ, నిధులు, సమాచార వ్యవస్థలు, నియామక నెట్‌వర్క్‌లు, సురక్షిత ప్రాంతాల వంటి మొత్తం వ్యవస్థపై చర్యలు అవసరమని తెలిపింది. ఈ అంశాలపై బ్రిక్స్ డిక్లరేషన్‌లో వచ్చిన ప్రస్తావన ప్రాధాన్యమైనదని పేర్కొంది. అదే సమయంలో భారత్ అనుసరిస్తున్న బహుముఖ విదేశాంగ విధానాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. అమెరికాతో సంబంధాలను విస్తరిస్తూనే రష్యాతో భాగస్వామ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. క్వాడ్‌లో సభ్యత్వంతో పాటు బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాలకు అవసరమైన చోట ఆ దేశంతో చర్చలు కొనసాగిస్తోంది. వివిధ దేశాల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ తన భద్రతకు సంబంధించిన అంశాలను బ్రిక్స్ వంటి వేదికపై చర్చకు తీసుకురాగలిగిందని 'డైరెక్టస్' విశ్లేషించింది. దీనివల్ల ఏ ఒక్క భౌగోళిక రాజకీయ కూటమిపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే దేశంగా భారత్ తన దౌత్యపరమైన స్థాయిని మరింత స్పష్టంగా చూపించిందని నివేదిక పేర్కొంది.

# కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

ఢిల్లీ: కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్‌ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్‌ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ.700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారం శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్‌ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

# మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

అమరావతి: కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ను కడప బైపాస్‌తో అనుసంధానించే నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ. 304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి సమగ్ర మౌలిక వసతుల కల్పనకు, పారిశ్రామిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో (వీసీఐసీ) కొప్పర్తి అత్యంత కీలకమైన నోడ్‌గా ఉందన్న ఆయన... కొత్తగా నిర్మించే అనుసంధాన రహదారి అందుబాటులోకి వస్తే పారిశ్రామిక సరుకు రవాణా మరింత వేగవంతం, సులభతరం అవుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, భారీ స్థాయిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగి రాయలసీమ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'.. లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలు (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది. అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

## పాక్ కదలికలపై ఇక 24 గంటల నిఘా.. ఈఓఎస్-05తో మారనున్న పరిస్థితులు?

ఢిల్లీ: భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక అడుగు వేసింది. భూస్థిర కక్ష్యలోకి పంపిన ఈఓఎస్-05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని 'ద డిప్లొమాట్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సంక్షోభ సమయంలో పాకిస్థాన్ నౌకలు, విమానాలు, వ్యూహాత్మక వనరులు, సైనిక బలగాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించే అవకాశం భారత్‌కు లభించనుందని తెలిపింది. సెప్టెంబర్ 4న జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ఈఓఎస్-05ను భూస్థిర కక్ష్యలోకి చేర్చింది. భూమికి దాదాపు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యతో భారత ఉపఖండంపై నిరంతర నిఘా కొనసాగించవచ్చు. ఈ ఉపగ్రహం ద్వారా దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా ఈఓఎస్-05 నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ఉపయోగిస్తోంది. ఇవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తాయి. అయితే అవి భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించడం సాధ్యం కాదు. ఈఓఎస్-05 విషయంలో ఈ పరిమితి తగ్గనుంది. సైనిక కదలికలను నిరంతరం గమనించడం వల్ల లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత దానిపై చర్య తీసుకునే సమయం తగ్గుతుందని నివేదిక తెలిపింది. కచ్చితమైన దాడులకు క్షిపణుల సామర్థ్యంతో పాటు లక్ష్యం ఎక్కడుందన్న తాజా సమాచారం కూడా కీలకమేనని పేర్కొంది. ఇదే సమయంలో భారత్ తన అంతరిక్ష నిఘా వ్యవస్థను మరింత విస్తరించే ప్రణాళికలో ఉంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించే స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్-3 కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. వీటిలో 21 ఉపగ్రహాలను ఇస్రో, 31 ఉపగ్రహాలను ప్రైవేటు రంగం అభివృద్ధి చేయనున్నాయి.

## వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారు: కిషన్ రెడ్డి

హైదరాబాద్: ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించండి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపాతం, పంటల సాగు, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి ఆరు కీలక అంశాలను సమగ్రంగా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

513 మండలాల్లో కరవు ఛాయలు

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో 268 మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 245 మండలాల్లో మోస్తరు వర్షాభావం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పంట, దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తాయని చెప్పారు. ఈ నివేదికలను కలెక్టర్లు సెప్టెంబర్ 24లోగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.

### ఉద్యాన పంటల రక్షణ, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత

వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల ఉద్యాన పంటలు ప్రమాదంలో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంటలు 'హై రిస్క్' కేటగిరీలో ఉన్నాయని, సుమారు 17,916 హెక్టార్లలో నారింజ, బత్తాయి, మామిడి, మిరప, ఉల్లి వంటి పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) వైపు రైతులను ప్రోత్సహించాలని నిర్దేశించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రైతులకు అందుబాటులోకి తేవడాన్ని ప్రశంసించారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి.. విశాఖకు కార్యాచరణ

రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతంలోనూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బోర్లపై ఆధారపడిన ప్రాంతాల్లో అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం నగరంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో తక్షణమే అత్యవసర సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరా పనులను వేగవంతం చేయాలన్నారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన నింపేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ ప్యాకేజీ-8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం విశాఖ నగరానికి మరో రెండు నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు.

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

ఢిల్లీ: దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

## నా జీవితం ధన్యమైంది.. ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను

### విశాఖలో చంద్రబాబు ఎమోషనల్

అమరావతి: విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

### మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ.10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు. విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మరోసారి యూరప్ పర్యటనకు జగన్.. షరతులతో సీబీఐ కోర్టు అనుమతి

అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆయన విదేశీ పర్యటనకు హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. కుటుంబ సమేతంగా యూరప్‌లోని తన కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, 15 రోజుల పర్యటనకు సమ్మతి తెలిపింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం... అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30వ తేదీల మధ్య 15 రోజుల వ్యవధిలో జగన్ యూరప్ పర్యటనను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే పర్యటనకు బయల్దేరే ముందు సమగ్ర ప్రయాణ ప్రణాళికను కోర్టుకు, సీబీఐ అధికారులకు సమర్పించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. విదేశీ పర్యటనలో అందుబాటులో ఉండే ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వివరాలను దర్యాప్తు సంస్థకు తప్పనిసరిగా అందించాలని కోర్టు కీలక షరతులు విధించింది.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

మొదటి పేజి తరువాయి

వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు.. అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని సీఎం అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణకు కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణాలను రూ.213.59 కోట్లతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబరు నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది.

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు: హరీశ్‌రావు

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

## గత ప్రభుత్వ అసమర్థత వల్లే కాళేశ్వరం కూలింది

హైదరాబాద్: వచ్చే వర్షాకాలం నాటికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో ప్రభుత్వం తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని.. ఆ తర్వాత ప్రాజెక్టుల్లో నిల్వలు, ఇతర అవసరాలు పరిగణనలోకి తీసుకుని సాగుకు నీరు అందిస్తామని ప్రకటించారు. నాటి భారాస ప్రభుత్వ వైఫల్యమే రైతుల కష్టాలకు కారణమని, పదేళ్లలో రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు చేపట్టినా ఒక్కటీ ఉపయోగంలోకి రాలేదన్నారు. ఎల్‌నినోపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "పదేళ్లు పరిపాలించిన భారాస ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. చరిత్రలోనే అతిపెద్ద తప్పిదం తుమ్మిడిహెట్టికి రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టిన తర్వాత ప్రాజెక్టు నిర్మాణాన్ని అక్కడ నుంచి మేడిగడ్డకు మార్చడం. ఫలితంగా రూ.34 వేల కోట్లతో పూర్తయ్యే దానికి రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టారు. ఈ ప్రాజెక్టుల పునాదులను నిపుణుల కమిటీ పరిశీలించి అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించింది. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల పునాదులూ నిర్మించారని తేలింది. అందుకే అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటికి మరమ్మతులు చేసే బాధ్యతను ఐఐటీ బాంబేకు అప్పగించాం. తుమ్మిడిహెట్టితోపాటు పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, కొడంగల్ ఎత్తిపోతలు, దేవాదుల తదితర ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే పూర్తిచేస్తాం. 48.58 లక్షల ఎకరాల ఆయకట్టు, తాగునీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వచ్చే ఏడాది జులై వరకు తాగునీటి అవసరాలు పరిగణనలోకి తీసుకుంటున్నాం. నదుల్లో ప్రవాహం ఉన్నప్పటికీ, ఆ నీటిని దిగువకు వదిలేస్తున్నారంటూ భారాస నాయకులు చేస్తున్న ప్రచారం అబద్ధం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి రావాల్సిన నీటి హక్కులపై మరింత బలంగా వాదనలు వినిపిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే గోదావరిలో అత్యధికంగా రికార్డు స్థాయిలో 2025-26లో 340 టీఎంసీలు, కృష్ణాలో 2024-25లో 286 టీఎంసీలు వినియోగించాం. ఈ ఏడాది జూన్ 1 నుంచి శ్రీశైలంలో ఏపీ 52 టీఎంసీలు తీసుకుంటే, తెలంగాణ 84 టీఎంసీలు... నాగార్జునసాగర్‌లో ఏపీ 17.2 టీఎంసీలు తీసుకుంటే.. తెలంగాణ 23.6 టీఎంసీలు తీసుకుంది" అని ఉత్తమ్ తెలిపారు.

## రూ.20 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి

హైదరాబాద్: 'ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 25% లోటు వర్షపాతం నమోదైంది. గత ఏడాది 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు కాగా... ఈసారి అది 1.23 కోట్ల ఎకరాలకు తగ్గింది. జలాశయాల్లో నీరు కూడా తక్కువగా ఉంది. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఉపశమన చర్యలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించాలి. ఎల్‌నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు నిపుణుల బృందాన్ని రాష్ట్రానికి పంపించాలి' అని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎల్‌నినో ప్రభావంపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరిగింది. చివరగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. కేంద్రం సహాయాన్ని కోరుతూ ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా... దానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు పలికినట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. భట్టి మాట్లాడుతూ... రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలకు రూ.20 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలని విన్నవించారు. వీబీ జీరాంజీ కింద అదనంగా పనిదినాలు కల్పించాలని, కూరగాయల సాగుకు ఆర్థికంగా సహాయం అందించాలని, అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్‌ను కేటాయించాలని, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి కింద తగిన సహాయం మంజూరు చేయాలని ఆయన కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే 2026 ఏప్రిల్ నుంచే వ్యవసాయ వర్సిటీతో సమీక్షలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. 27 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి.. సూచనలు ఇచ్చామన్నారు. వచ్చే ఏడాది వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని అంచనాలు ఉన్నందున... తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 808 టీఎంసీల సామర్థ్యానికి ఇప్పుడు 465 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. 35 జలాశయాల్లో నీటిమట్టాన్ని రోజూ పర్యవేక్షిస్తున్నామని, సింగూరుపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. సింగూరులో 12 టీఎంసీలకు 4.45 టీఎంసీలే ఉందని, ఈ నీరు 75 రోజులకే సరిపోతుందని పేర్కొన్నారు. వర్షపాతం లోటు.. విద్యుత్‌పై తీవ్రప్రభావం చూపుతోందని, వర్షం లేక ఉక్కపోత కొనసాగితే.. విద్యుత్ వినియోగం పెరుగుతుందని చెప్పారు. అటు మోటార్లు.. ఇటు ఇళ్లలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయని, సెప్టెంబరు 9న విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,543 మెగావాట్లకు చేరుకుందని, గత ఏడాది అదేరోజు కంటే 4 వేల మెగావాట్లు అదనమన్నారు. ఇంత డిమాండ్ ఉన్నా.. రైతులకు, గృహావసరాలకు, పరిశ్రమలకు సరఫరా కొనసాగిస్తున్నామన్నారు.

## కడపలో టీడీపీ జిల్లా కార్యాలయ స్లాబ్ పూజ



కడప మహి న్యూస్ సెప్టెంబర్ 19: కడపలో నూతనంగా నిర్మించనున్న తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, జిల్లా పార్లమెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ నజీముద్దీన్, మన్సూర్ అక్బర్, జనార్ధన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూచిపూడి నాట్యంతో అలరించిన చిన్నారులు

### యానంలో ఘనంగా విజయ గణపతి నవరాత్రి ఉత్సవాలు.



యానం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: కేంద్రపాలిత ప్రాంతమైన యానంలోని జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణం వద్ద కొలువై ఉన్న శ్రీ విజయ గణపతి స్వామివారి ఆరో గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ రాజరాజేశ్వరి నృత్యాలయం, యానం ఆధ్వర్యంలో శ్రీ వాత్సవి శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. నృత్య గురువుల మార్గదర్శకత్వంలో శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకాలు, హావభావాలు, లయబద్ధమైన నృత్య విన్యాసాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు సంప్రదాయ నృత్య వస్త్రధారణతో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడంతో కార్యక్రమ ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. విజయ గణపతి స్వామివారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను నిర్వాహకులు, భక్తులు అభినందించారు

## త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎం గోదాములను పరిశీలించిన

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 19:- త్రైమాసిక తనిఖీలో భాగంగా నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల భద్రతా ఏర్పాట్లు, సీల్‌లు, రక్షణ చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్న తీరును ఆమె తనిఖీ చేశారు. గోదాముల పరిసరాల్లో చేపడుతున్న భద్రతా చర్యలను కూడా పరిశీలించి, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో డిఆర్ఓ రాము నాయక్, ఆర్డిఓ విశ్వనాథ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ భాష, తెలుగుదేశం పార్టీ తరపున శివరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సాయిరాం రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రదీప్, సీపీఐ తరపున నరసింహులు తదితర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

## పింఛన్ల అర్హతలపై ఆరు దశల ధ్రువీకరణ పక్కాగా చేపట్టాలి



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 19:- పింఛన్ల మంజూరులో ప్రభుత్వం నిర్దేశించిన ఆరు దశల ధ్రువీకరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పింఛన్ల అర్హతలు, దరఖాస్తుల పరిశీలనపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారుల ఎంపికలో కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం నిర్దేశించిన ఆరు అర్హత ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండటం, నెలకు సగటున 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం ఉండటం, నిర్ణీత పరిమితికి మించి వ్యవసాయ భూమి కలిగి ఉండటం, పట్టణ ప్రాంతాల్లో 1,000 చదరపు అడుగులకు మించి ఆస్తి కలిగి ఉండటం, కుటుంబంలో ఆదాయ పన్ను చెల్లించేవారు ఉండటం, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండటం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించి అర్హతను నిర్ధారించాలన్నారు. మాగాణి భూమి మూడు ఎకరాలలోపు, మెట్ట భూమి పది ఎకరాలలోపు ఉండేలా భూ పరిమితులను పరిశీలించాలని, మాగాణి, మెట్ట భూములు కలిపి పది ఎకరాలకు మించకుండా ఉన్నాయా లేదా అనే అంశాన్ని కూడా ధ్రువీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం వేర్వేరు రైస్ కార్డులు ఉన్నాయనే కారణంతో ప్రత్యేక కుటుంబంగా పరిగణించి పింఛన్ మంజూరు చేయరాదని, హౌస్‌హోల్డ్ ఆధారంగా అర్హతను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు, చర్మకారులు, చేనేత కార్మికుల పింఛన్ దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన వయోపరిమితి, ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో క్లియర్ చేసి, పింఛన్ల పోర్టల్‌లో డేటా అప్‌లోడ్‌కు ముందే వివరాలు, పత్రాలు, అర్హతలను పూర్తిస్థాయిలో ధ్రువీకరించాలన్నారు. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన పింఛన్ లబ్ధిదారుల వివరాలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ధ్రువీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తహశీల్దార్లు, ఎంపీడీఓలు, సాంఘిక సంక్షేమం, చేనేత, మత్స్య, మైనారిటీ సంక్షేమం తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ అందేలా, అనర్హులకు మంజూరు కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి



నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 19:- స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని పరిసరాలను పరిశీలించారు. కార్యాలయాల ఆవరణలో ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించకుండా ప్రతిరోజూ పరిశుభ్రతను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్వహణ, పచ్చదనం, మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 2 వరకు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి కార్యాలయాన్ని పరిశుభ్రతకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డుల కోసం కలెక్టరేట్, శిశుగృహ (స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీ), ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (ఖఎఖ) నుంచి నాలుగు నామినేషన్లు పంపించినట్లు తెలిపారు. నామినేట్ చేసిన కార్యాలయాల్లో పరిశుభ్రత ప్రమాణాలు, పరిసరాల నిర్వహణ, పచ్చదనం తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి అవార్డులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు. థర్డ్ పార్టీ తనిఖీ బృందాలు సోమవారం నుంచి ఎప్పుడైనా కార్యాలయాలను సందర్శించే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలు కనిపించిన వెంటనే తొలగించాలని, పరిశుభ్రత లోపాలు పునరావృతం కాకుండా బాధ్యతలను సిబ్బందికి స్పష్టంగా కేటాయించాలని కలెక్టరేట్ ఏఓ ను ఆదేశించారు. కార్యాలయం లోపల, బయట పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్ల శుభ్రత, చెత్త నిర్వహణ, మొక్కల సంరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2తో ముగిసినా, కార్యాలయాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అధికారి, ఉద్యోగి స్వచ్ఛతను తమ బాధ్యతగా స్వీకరించి, ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన కార్యాలయ వాతావరణాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# సుంకరపాలెంలో ఘనంగా పెన్నల పూజ...

### భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు.

తాళ్లరేవు,మహి న్యూస్, సెప్టెంబర్ 19: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలోని పురాతన శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో 75వ గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శు



క్రవారం శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పెన్నల పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆలయ అర్చకులు కోఁణంబట్ల సత్తిబాబు శర్మ బ్రహ్మత్వంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మోపురి శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు బ్రదర్స్ సహకారంతో పెన్నల పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

### తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు.

శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 75వ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు ఆలయంలో ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

### పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు.

పెన్నల పూజ సందర్భంగా సుంకరపాలెం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. మహిళలు, యువత, విద్యార్థులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం సభ్యులు మాట్లాడుతూ, సుంకరపాలెం



శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో 75 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఏడాది భక్తుల సహకారంతో ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి వర్తక సంఘం సభ్యులు, పెద్దిరెడ్డి విగ్నేశ్వర రావు, పెద్దిరెడ్డి రవికుమార్,మాగాపు శ్రీనివాసరావు, నరహరిశెట్టి శ్రీనివాస్, పడాల సత్తిబాబు, మాగాపు చంద్ర శేఖర్, మాకిరెడ్డి సత్తిబాబు, మాగాపు లోవరాజు, కొప్పిశెట్టి బుజ్జి,శాఖ వినాయకరావు, నరహరిశెట్టి గణేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు గణపతి నామస్మరణతో మార్మోగాయి.

# పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలి

### శిక్షణ పూర్తైన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కార్యాచరణ
### జాబ్ మేళాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచాలి
### డిసెంబర్ నాటికి నైపుణ్యం పోర్టల్‌లో 100 శాతం నమోదు పూర్తి చేయాలి
### జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి

కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): జిల్లాలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను గుర్తించి, పరిశ్రమల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ అందించి, శిక్షణ పూర్తైన వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగ డిమాండ్‌ను ముందుగానే గుర్తించి, దానికి అనుగుణంగా యువతకు శిక్షణ అందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను ఆలస్యం చేయకుండా 10 రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సామాజిక బాధ్యత నిధులతో నిర్మించిన సీడాప్ భవనాలు, పారిశ్రామిక శిక్షణ సంస్థల్లోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కేంద్రాలను అవసరమైన సంస్థలు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే సంస్థల మానవ వనరుల అవసరాలను గుర్తించి, స్థానిక యువతకు అందుకు అనుగుణంగా శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేసి రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద




వచ్చిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన శిక్షణ తరగతులను త్వరగా పూర్తి చేసి తదుపరి బ్యాచ్‌లను ప్రారంభించాలని ఆదేశించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పెయింటర్లు, కార్పెంటర్లు, మేస్త్రీలు తదితర కార్మికులకు కూడా నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న సౌర విద్యుత్ పలకల ఏర్పాటు వంటి నైపుణ్యాలను శిక్షణలో చేర్చాలని సూచించారు. ఉద్యోగ మేళాల్లో ఎంపికయ్యే అభ్యర్థుల సంఖ్యను పెంచాలని, ముఖ్యంగా యువత తక్కువగా పాల్గొంటున్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కళాశాలల్లో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ మేళాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నైపుణ్యం పోర్టల్‌లో నమోదులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి 100 శాతం నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఉపాధి కల్పన అధికారిని ఆదేశించారు. జిల్లాలో 19 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన 10వ తరగతి ఉత్తీర్ణులు, అనుత్తీర్ణులైన యువతకు అమరరాజా బ్యాటరీస్ సంస్థ అందిస్తున్న నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు.

### విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ
### విద్యార్థుల హాజరు, ఫలితాలు,

### అకడమిక్ స్టార్ రేటింగ్‌పై ప్రత్యేక దృష్టి

జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ డా. ఏ.సిరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల ఫలితాలు, సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత శాతాన్ని విశ్లేషించి, వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఏ పాఠశాలలో ఏ సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు విషయంలో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ 9, 10వ తరగతుల్లో ఉపాధ్యాయుల హాజరు 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల మౌలిక వసతులు, నిర్వహణ, తల్లిదండ్రుల భాగస్వామ్యం



తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా యూడీఐఎస్ఈలో అకడమిక్ స్టార్ రేటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. 8, 9, 10వ తరగతులు, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, విశ్వవిద్యాలయ స్థాయిల్లో కృత్రిమ మేధస్సుతో పాటు ఆరోగ్యం, వాణిజ్యం, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన కోర్సుల పాఠ్య ప్రణాళిక రూపొందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ భారతి, డీఈఓ సుధాకర్, సర్వశిక్ష అభియాన్ పీఓ లోకరాజ్, ఉపాధి కల్పనాధికారి దీప్తి, ఆర్ఐఓ లాలప్ప, నైపుణ్యాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 9 నాటికి సర్ తుది ఓటర్ల జాబితా ప్రచురణకు పకడ్బందీ చర్యలు

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 19:- ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)లో విచారణలు, ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి, పెండింగ్ క్లెయిమ్‌లు, ఫామ్‌లను వేగంగా పరిష్కరిస్తూ అక్టోబర్ 9 నాటికి తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సర్ ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాము నాయక్, రాజకీయ పార్టీల తరపున ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ భాష, టిడిపి నుంచి శివరామిరెడ్డి, వైయస్సార్సీపి నుంచి సాయిరాం రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, సిపిఐ నుంచి నరసింహులు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ పబ్లికేషన్ జూలై 31న నిర్వహించగా, ముందుగా నిర్ణయించిన ఆగస్టు 3వ తేదీకి బదులుగా తుది ప్రచురణ తేదీని భారత ఎన్నికల సంఘం అక్టోబర్ 9వ తేదీ వరకు పొడిగించిందన్నారు. ఈ అదనపు వ్యవధిని సద్వినియోగం చేసుకుని ఓటర్ల వివరాల పరిశీలన, అభ్యంతరాలు, విచారణలు, క్లెయిమ్‌ల పరిష్కారం తదితర ప్రక్రియలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియలో భాగంగా దాదాపు 6 లక్షల మంది ఓటర్ల డేటా మ్యాపింగ్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన డేటాలో పేర్లలో వ్యత్యాసాలు, పుట్టిన తేదీల్లో తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం, కుటుంబ సభ్యుల వివరాల్లో అసాధారణతలు తదితర 9 రకాల అనామలీలను గుర్తించామన్నారు. వీటికి సంబంధించి మొత్తం 80,283 నోటీసులు జారీ చేసి విచారణలు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

### 88 శాతం డేటా ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధం



జిల్లాలో మొత్తం 12,25,937 మంది అర్హులైన ఓటర్లకు సంబంధించిన డేటాలో 11,45,665 మంది వివరాలను, అంటే సుమారు 88 శాతం డేటాను ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మిగిలిన సుమారు 12 శాతం డేటాను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విచారణలు పూర్తయిన నేపథ్యంలో ఇకపై ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8 దరఖాస్తులు, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.




### ఫోటో వెరిఫికేషన్ వేగవంతం చేస్తున్నాం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్యూమరేషన్ ఫామ్‌లలో అప్‌లోడ్ చేసిన ఓటర్ల ఫోటోలు స్పష్టంగా, సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంపై పునఃపరిశీలన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. సుమారు 12 లక్షల ఫోటోల్లో 10 లక్షల ఫోటోల పరిశీలన పూర్తయిందని, మిగిలిన సుమారు 12 శాతం ఫోటో వెరిఫికేషన్‌ను ఈ వారంలోనే పూర్తి చేయాలని ఈఆర్వోలు, సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వివరించారు.

## అక్టోబర్ 23న అనంతపురంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు





అనంతపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో అక్టోబర్ 23న సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026 ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అతిథి గృహాలను వారు పరిశీలించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు, ప్రముఖులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించి ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సదస్సులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొననున్నారు. జిల్లాలోని పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించడం, పెట్టుబడి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం, స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను జాతీయ, అంతర్జాతీయ భాగస్వాములతో అనుసంధానించడం వంటి అంశాలు సదస్సులో చేపట్టనున్నారు.

## పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రామాణిక పుస్తకాలు అందుబాటులో ఉంచాలి





అనంతపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, ప్రామాణిక అధ్యయన సామగ్రిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. శనివారం అనంతపురం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని మౌలిక వసతులు, పాఠకులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె.శివప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల విడుదలైన ఏపీపీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని పోటీ పరీక్షల పుస్తకాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతతో మాట్లాడి వారికి అవసరమైన పుస్తకాలు, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ అధ్యయన కేంద్రం పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనులను త్వరగా పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయానికి రావాల్సిన గ్రంథాలయ సెస్ బకాయిల వివరాలను కార్యదర్శి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## తల్లులు, పిల్లల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి







అనంతపురం, సెప్టెంబర్ 19 (మహి న్యూస్): పోషణ్ మాహ్‌లో భాగంగా అనంతపురం నగరంలోని బరమప్ప వీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం తనిఖీ చేశారు. బాలింతలు, చిన్నారులతో మాట్లాడిన కలెక్టర్ పోషకాహార కార్యక్రమాల అమలును పరిశీలించారు. తల్లులు, పిల్లల హిమోగ్లోబిన్ స్థాయిలు, చిన్నారుల బరువులు, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణను సమీక్షించారు. పిల్లల బరువుల నమోదుతో పాటు ప్రీస్కూల్ పిల్లలకు సమాచారాన్ని చేరవేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లులు, పిల్లలకు పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోజువారీ ఆహారంలో తగినంత ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. "మన అంగన్‌వాడీ.. మన బాధ్యత" అనే భావనతో ప్రతి ఒక్కరూ తల్లులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సాజిదా బేగం, అర్బన్ సీడీపీవో సి. లలితమ్మ, సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



అనంతపురం, సెప్టెంబర్ 19 (మహి న్యూస్): నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పన్నుల శాఖలో అమలు



చేస్తున్న కృత్రిమ మేధ ఆధారిత విధానాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పన్ను రిటర్నుల పరిశీలన, బకాయిల వసూళ్లు, న్యాయపరమైన వ్యవహారాలకు సంబంధించిన కృత్రిమ మేధ సాధనాల పనితీరును పరిశీలించారు. పన్నుల వసూళ్లు పెంచడంతో పాటు బకాయిలను సకాలంలో వసూలు చేసేందుకు ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకత పాటిస్తూ... ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలి.



రాయచోటి, మహి న్యూస్, సెప్టెంబర్ 19: రాయచోటిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజల సంఖ్య, ఆ రోజు పూర్తయిన రిజిస్ట్రేషన్లు, స్లాట్ బుకింగ్ వివరాలను సబ్‌రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలను జిల్లా కలెక్టర్ స్వయంగా కలిసి, వారి స్లాట్ సమయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కార్యాలయంలో అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందుతున్న తీరుపై వారి అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటిస్తున్న విధానాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలించడంతో పాటు, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న కొంతమంది వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడి కార్యాలయంలో సేవలు ఎలా అందుతున్నాయి, సిబ్బంది స్పందన ఏ విధంగా ఉంది, ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనే అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, సకాలంలో అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, ప్రజలకు అందించే సేవల విషయంలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సబ్‌రిజిస్ట్రార్, రిజిస్ట్రేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇక మారుమూల ఇంటి వద్దకే చెత్త బండి

## ప్రజల సహకారంతోనే స్వచ్ఛ అనంత సాధ్యం: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: అనంతపురం నగరంలో మారుమూల ప్రాంతాల్లోని ఇళ్ల వద్దకే చెత్త సేకరణ వాహనాలు వెళ్లేలా ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చామని



అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరపాలక సంస్థకు ప్రభుత్వం కేటాయించిన ఈ-ఆటోలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. నగరపాలక సంస్థకు మొత్తం 62 ఈ-ఆటోలు కేటాయించగా, తొలి విడతగా 15 వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నచిన్న వీధుల్లోకి సైతం వెళ్లి చెత్త సేకరించేలా వీటిని వినియోగించనున్నారు. ప్రజలు చెత్తను ఈ-ఆటోలకు అందించి పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. నగరంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన సుమారు మూడు లక్షల టన్నుల చెత్తలో ఇప్పటికే రెండు లక్షల టన్నులు తొలగించామని తెలిపారు. మిగిలిన చెత్తను కూడా త్వరలో తొలగిస్తామన్నారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో రూ.15 కోట్లతో






వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసి శుద్ధి చేయడంతో పాటు ఎరువులు, ఇతర పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అదే ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### ఏపీ నుంచే కొత్త కార్యక్రమాలకు శ్రీకారం: ఎంపీ అంబికా

దేశంలో పలు వినూత్న కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకారం చుడుతున్నామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కాలుష్యరహిత ఈ-వాహనాల ద్వారా నగరంలోని మారుమూల ప్రాంతాల్లోనూ చెత్త సేకరణ జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యంతో ప్రతి వారం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో అనంతపురం నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, డైరెక్టర్లు భవాని రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, పోతుల లక్ష్మీనరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరువు మండలాల ప్రకటనలో జాప్యం ఎందుకు? ప్రభుత్వంపై కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గరెడ్డి ఫైర్

### యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు.. తక్షణమే ఎరువులు అందించాలి
### సాగునీరు, ఆక్వా రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి
### నిత్యావసర ధరల భారంతో సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం



(మహి న్యూస్ రావులపాలెం సెప్టెంబర్ 19): రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈరోజు రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, రైతులకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందడం లేదని పార్టీ పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వ అధికారిక వర్షపాత గణాంకాల ప్రకారం 2026 జూన్ 1 నుంచి సెప్టెంబర్ 18 వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 50 శాతం లోటు నమోదవగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్



కోనసీమ జిల్లాలో 41.9 శాతం లోటు నమోదైంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు అవసరమైన ఉపశమన చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కరువు ప్రభావిత మండలాలను గుర్తించి వెంటనే అధికారికంగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. కరువు మండలాల ప్రకటన ద్వారా అర్హ త ఉన్న రైతులకు పంట రుణాల రీషెడ్యూల్, పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ప్రభుత్వ సహాయాలు అందే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా శాస్త్రీయంగా వర్షపాతం, పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి రైతులకు తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని కోరింది. పంటల బీమా విషయంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ౹ావీఖీద్, రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకాలు అమల్లో ఉన్నాయని రాష్ట్ర బడ్జెట్ పత్రాలు పేర్కొంటున్నాయి.

### యూరియా కొరతను వెంటనే పరిష్కరించి ప్రతి రైతుకూ ఎరువులు అందించాలి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా, ఇతర ఎరువుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. వరి, కొబ్బరి, కంద, కోకో, కూరగాయలు, పశుగ్రాస పంటలు సాగు చేస్తున్న చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందకపోతే పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. రైతులు ప్రభుత్వ విక్రయ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా, మండలాల వారీగా అవసరాన్ని అంచనా వేసి సరఫరా చేయాలని కోరింది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు, మరోవైపు సాగు ఖర్చుల భారం పెరగడం రైతులకు ఆర్థికంగా మరింత ఇబ్బందికరంగా మారుతోందని తెలిపింది. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా సంవత్సరానికి ?20,000 ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యం ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పత్రాలు పేర్కొంటున్నాయి. 2026--27 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతగా ?7,000ను 46.85 లక్షల రైతు కుటుంబాలకు విడుదల చేసినట్లు సంబంధిత సమాచారం వెల్లడిస్తోంది. కాబట్టి రైతులకు ప్రకటించిన సహాయాన్ని సకాలంలో అందించడంతో పాటు, పంట నష్టాలు ఎదురైన ప్రాంతాల్లో అవసరమైన ఇతర సహాయ చర్యలు కూడా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కోరింది.

### కాలువలకు నీరు అందించాలి.. చివరి భూముల రైతులను ఆదుకోవాలి

ఖరీఫ్ సీజన్‌లో కాలువల చివరి ఆయకట్టు భూములకు కూడా సాగునీరు అందేలా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. వ్యవసాయ కాలువల నిర్వహణ, పూడికతీత పనులు, నీటి సరఫరా విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరమని పేర్కొంది. నీరు అవసరమైన సమయంలో కాలువల్లో నీటి లభ్యత లేకపోవడం వల్ల చివరి ఆయకట్టు రైతులు పంటలు వేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. పనుల నాణ్యత, ఖర్చులు, బిల్లుల చెల్లింపుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిధులు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేసింది. ఆక్వా రంగంలో కూడా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరింది. రొయ్యల పెంపకంలో ఫీడ్, విద్యుత్, మందులు, ఇతర ఇన్‌పుట్ ఖర్చులు పెరగడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోందని తెలిపింది. రొయ్యల మార్కెట్ ధరలు, ఫీడ్ ధరలు, ఉత్పత్తి వ్యయం తదితర అంశాలపై ప్రభుత్వం రైతులు, ఆక్వా రంగ ప్రతినిధులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. రైతులకు ఖర్చులు తగ్గించే విధానాలు, మార్కెట్‌లో పారదర్శకత, మధ్యవర్తుల నియంత్రణ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ఇసుక, మద్యం అక్రమాలపై ముఖ్యమంత్రి స్వయంగా తనిఖీలు చేయాలి.. నిత్యావసర ధరలపై చర్యలు తీసుకోవాలి జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు, ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాల్లో నిబంధనల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాకు వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీల అమలు స్థితిని పరిశీలించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరింది. ఇసుక సరఫరా, ధరలు, అనుమతులు, తవ్వకాల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పేర్కొంది. అదేవిధంగా మద్యం విక్రయాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు, ఎంఆర్‌పీ అమలుపై కూడా కఠిన పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేసింది. మరోవైపు సామాన్య ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. అయితే ధరలు ప్రాంతం, మార్కెట్, నాణ్యతను బట్టి మారుతుంటాయని, కాబట్టి ప్రభుత్వం అధికారిక ధరల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని కోరింది. సెప్టెంబర్ 18, 2026 నాటి కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల్లో దేశవ్యాప్తంగా తూర్/కందిపప్పు సగటు రిటైల్ ధర ?124.43 కిలో, చక్కెర ?58.55 కిలోగా నమోదైంది; ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న ధరల డేటాలో కూడా వివిధ నిత్యావసర వస్తువుల ధరలు రోజువారీగా మారుతున్నాయి. కాబట్టి రైతులకు ఎరువులు, సాగునీరు, పంటల బీమా, రుణాల ఉపశమనం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి వ్యవసాయ సహాయాలను సకాలంలో అందించడంతో పాటు, సామాన్య ప్రజలపై నిత్యావసర ధరల భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కరువు పరిస్థితులపై తక్షణ సమీక్ష నిర్వహించి అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు ప్రకటించాలని, రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని, ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించాలని, ఇసుక మరియు మద్యం విక్రయాల్లో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కోరింది. రైతు, కూలీ, సామాన్య కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే కార్యాచరణ చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది.

# అన్నమయ్యలో పారిశ్రామిక పెట్టుబడులకు ఊతం



వాల్మీకిపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: అన్నమయ్య జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మరియు ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విజ్ఞప్తి మేరకు శనివారం ఆయన జిల్లా అధికారులతో కలిసి వాల్మీకిపురం మండలం తాటికుంటపల్లి వద్ద ఉన్న పారిశ్రామిక పార్కు కోసం ప్రతిపాదించిన భూములను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద పారిశ్రామిక పార్కు ఫేజ్--2 అభివృద్ధికి సుమారు 490 ఎకరాల భూమిని ప్రతిపాదించిన నేపథ్యంలో కలెక్టర్ తో కలిసి పరిశ్రమల శాఖ కార్యదర్శి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.... పారిశ్రామిక పార్కులో పరిశ్రమలకు అవసరమైన నీటి వసతి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమీపంలోని కాలువ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించడంతో పాటు, అందుబాటులో ఉన్న చెరువులను నీటితో నింపడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన నీటి వసతిని కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తగిన మౌలిక వసతులు అందుబాటులో ఉంటే జిల్లాలో మరిన్ని పరిశ్రమలను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, పీఐపీ పారిశ్రామిక పార్కు పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు గుర్తించిన భూములను కూడా కార్యదర్శి పరిశీలించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా భూముల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం గుర్తించిన అదనపు భూముల వివరాలను కూడా కలెక్టర్ నిశాంత్ కుమార్ కార్యదర్శికి వివరించారు. పరిశ్రమల స్థాపనకు అనువైన భూముల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి పంపిస్తే, వాటిపై తగిన చర్యలు తీసుకుని పరిశ్రమలకు భూముల కేటాయింపునకు అవసరమైన సహకారం అందిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో పీలేరు ఆర్డీఓ కే. విజయలక్ష్మి, ఉమ్మడి జిల్లా ఏపీఐఐసీ జెడ్ఎం సురేష్, డీఐసీ జీఎం కిషోర్, వాయల్పాడు తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## ఏడాది ప్రజా సేవ పూర్తి చేసిన పల్నాడు కలెక్టర్ కృతిక శుక్ల
### విశిష్ట సేవలకు జిల్లా అధికారుల అభినందనలు



పల్నాడు, మహి న్యూస్, సెప్టెంబర్ 19: పల్నాడు జిల్లా తొలి మహిళా కలెక్టర్‌గా సెప్టెంబర్ 2025లో



బాధ్యతలు స్వీకరించిన కృతిక శుక్ల విజయవంతంగా ఏడాది ప్రజా సేవను పూర్తి చేసుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన దిశగా జిల్లాను వివిధ రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ అందించిన సేవలను గుర్తిస్తూ జిల్లా అధికారులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు కలెక్టర్ కృతిక శుక్లను అభినందించి, ఆమె నాయకత్వంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు.

## దివ్యాంగుల పిల్లల హక్కుల పరిరక్షణకు చర్యలు
### గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి



పల్నాడు, మహి న్యూస్, సెప్టెంబర్ 19: దివ్యాంగుల పిల్లలకు అవసరమైన సంరక్షణ, రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల పిల్లల సంరక్షణ, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంబంధించి గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హుల నుంచి వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న వారికి సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. దివ్యాంగుల పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు, సంరక్షకులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, గార్డియన్‌షిప్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు.

## టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు మౌలిక వసతులు సిద్ధం చేయాలి






పల్నాడు, మహి న్యూస్, సెప్టెంబర్ 19: జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, భూమి లభ్యత, విద్యుత్, నీటి సౌకర్యం, అనుమతులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూమి, మౌలిక వసతుల లభ్యతపై సమగ్ర వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, నీటి సదుపాయాల కల్పనతో పాటు అవసరమైన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పార్క్ ఏర్పాటుతో జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగేలా అవసరమైన చర్యలు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

## ఉపాధ్యాయ ఎం.ఎల్.సి లకు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావాలి



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 19 : ఉపాధ్యాయ ఎం.ఎల్.సి ఎన్నికలలో ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తెలిపారు. గతంలో తయారు చేసిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిందేనని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ కృష్ణ – గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ప్రస్తుత హోదా 2027 మార్చి 29వ తేదీన ముగుస్తుందన్నారు. కృష్ణ – గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల నోటిఫికేషన్ ఈ నెల 28వ తేదీన ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమానికి బహిరంగ నోటీస్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 15, 25 తేదీలలో వార్తా పత్రికలు ద్వారా ప్రచురణ రెండు సార్లు జరుగుతుందన్నారు. నవంబరు 6వ తేది వరకు ఓటరు నమోదుకు ఫారం 19 స్వీకరణ జరుగుతుందన్నారు. నవంబరు 25వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల, డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 25వ తేదీ నాటికి అభ్యంతరాల పరిష్కారం జరుగుతుందని వివరించారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల జరుగుతుందని చెప్పారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్) కింద 1,68,220 నోటీసులు జారీ చేయగా, 1,094 మాత్రమే విచారణ పెండింగ్ లో ఉందన్నారు. ఫారం 6 – 12,044, ఫారం 7 – 2,047, ఫారం 8 – 9,085 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటి వరకూ ఫారం 6 క్రింద అందిన వాటిలో 8,407 దరఖాస్తులు ఓటరుగా నమోదు చేయడం జరిగిందని, 370 తిరస్కరించడం జరిగిందని వివరించారు. ఫారం 7 క్రింద అందిన దరఖాస్తులలో 1,899 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, మూడు తిరస్కరించడం జరిగిందని చెప్పారు. ఫారం 8 క్రింద అందిన దరఖాస్తులలో 6,859 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, 608 తిరస్కరించడం జరిగిందని చెప్పారు. బుక్ ఎ కాల్ క్రింద రాష్ట్రంలో అత్యధికంగా వచ్చిన కాల్స్ లో గుంటూరు జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, ఇ.ఆర్.ఓ లు ఐ.కిషోర్, పద్మావతి, గంగ రాజు, ముఖ్య టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఎన్.ఓంకార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వై వి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఆర్.వి.నరసింహా రావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ధ్యేయం కావాలి



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబరు 19 : పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో శనివారం చేపట్టారు. జిల్లాలో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాలు మేరకు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రజలతో స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ పెదకాకాని మండలంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ



పరిరక్షణలో భాగంగా క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో మంచి అవగాహన కలుగుతుందని అన్నారు. క్యారీ బ్యాగులు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలను క్లాప్ మిత్రాలకు అప్పగించాలని కోరారు. పరిశుభ్రత చోటుచేసుకున్న ప్రాంతాల్లో అక్కడ ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తే ఆ ప్రదేశంలో చెత్త వేసేందుకు ఎవరు ముందుకు రావడం జరగదని చెప్పారు. రోజువారీ అవసరాలు కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్, గన్ని



బ్యాగులు వాడాలని కోరారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించి, ఒక మంచి అలవాటుగా మార్చుకుని స్ఫూర్తిదాయంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పల్నాడు అభివృద్ధిలో కలెక్టర్ కృతిక శుక్ల ప్రత్యేక ముద్ర

## ఏడాది పాలన పూర్తి సందర్భంగా ఘనంగా అభినందన సభ



నరసరావుపేట, మహి న్యూస్, సెప్టెంబర్ 19: ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ కృతిక శుక్ల తనదైన ముద్ర వేశారని సంయుక్త కలెక్టర్ సంజనా సింహ కొనియాడారు. కలెక్టర్‌గా కృతిక శుక్ల బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు కలెక్టర్ సరికొత్త గుర్తింపు తీసుకొచ్చారని, ప్రజల అర్జీలను స్వయంగా పరిశీలిస్తూ పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి అద్దెయ్య మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తూ జిల్లా యంత్రాంగాన్ని కుటుంబంలా నడిపిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ పొగాకు రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను



పరిష్కరించి వారికి నాణ్యమైన ధర లభించేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారంలో కలెక్టర్ వేగవంతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. పదో తరగతిలో 87 శాతం ఉత్తీర్ణత సాధించామని, వచ్చే విద్యా సంవత్సరంలో 90 శాతానికి పైగా ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. జిల్లాలో 336 పోషక తోటలను ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పోషక, వంట తోటలను ఏర్పాటు చేయించారని చెప్పారు.

### సమష్టి కృషితోనే అభివృద్ధి: కలెక్టర్

కలెక్టర్ కృతిక శుక్ల మాట్లాడుతూ ఏడాది కాలంలో జిల్లా సాధించిన ప్రగతి సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, పోలీసు శాఖతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమష్టి కృషి ఫలితమన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నారని, పీజీఆర్ఎస్‌తో పాటు ఇతర మార్గాల్లో వచ్చే ప్రతి అర్జీని కేవలం కాగితంగా కాకుండా ఒక కుటుంబ సమస్యగా భావించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో విద్య, వైద్య రంగాల బలోపేతం, మహిళా సాధికారత, మౌలిక వసతుల కల్పనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పల్నాడు జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టేందుకు అధికారులు, సిబ్బంది ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మండల అధికారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్.సి, ఎస్.టి సంక్షేమానికి కృషి

గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 19 : ఎస్.సి, ఎస్.టి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ లేని యానాది కులానికి చెందిన 531 మందిని గుర్తించామని, డొమిసిల్ సర్టిఫికెట్ తహసిల్దార్ నుండి ఇప్పించి ఆధార్ కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు.

### గిరిజన భవన్ మరమ్మతుల పనులు

మంజూరు చేశామని అన్నారు. అంబేద్కర్ భవన్ పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించుటకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. జిల్లాలో మార్పు కార్యక్రమం ప్రత్యేకంగా





తీసుకున్నామని, ఈ కార్యక్రమంలో వసతి గృహాలు, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి వసతి గృహాలలో అన్ని వసతులు కల్పించాలని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులపై జరిగే దాడులపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మొత్తం కేసులు, డ్రాప్ చేసిన కేసులు వివరాలు కూడా సమావేశంలో అందించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలు నిబంధనల మేరకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. వసతి గృహాలలో మెనూ పక్కాగా, నాణ్యమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్.సి, ఎస్.టి మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిర్దేశిత సమయంలో న్యాయం లబ్ధిదారులకు అందించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో సునిశితమైన కేసుల వివరాలు పోస్టు చేయరాదని స్పష్టం చేశారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్ లో కేసులు ఉండకుండా, కేసులు సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పింఛను మంజూరు చేయుటకు విద్యుత్ కనెక్షన్ నంబర్ విధిగా ఉండాలని ఎస్.జి.ఎస్.డబ్ల్యు సిబ్బంది అంటున్నారని దానిపై దృష్టి సారించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టి చట్టాలపై మరింత అవగాహనను పోలీసు శాఖకు అందించడం అవసరమని అభిప్రాయపడ్డారు. కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ జూలై నుండి ప్రత్తిపాడులో కేసు పెడుతుంటే తీసుకోవడం లేదన్నారు. అనునిత్యం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టిలకు మంజూరు చేసిన దుకాణాలు, వారే అనుభవించేటట్లు చూడాలని, లబ్ధిదారులు ఇతరులకు ఇచ్చినా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాలలో ఆహార పదార్థాలు నాణ్యత మెరుగు పరుచుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, జిల్లా సాంఘిక సంక్షేమ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, డి.ఎస్.పిలు, కమిటీ సభ్యులు అనురాధ, గుడెపు అశ్వినీ కుమార్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అనంతపురం మహి న్యూస్ సెప్టెంబర్ 19: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. అనంతపురం నగరంలోని పంగల్ రోడ్డులో గల అనంత టౌన్‌షిప్‌లో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. పథకం కింద బ్యాంకుల ద్వారా 5.75 శాతం వార్షిక వడ్డీతో రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో నమోదైన సౌర ప్యానెల్ విక్రేతలు, బ్యాంకర్లు, అధికారులు వినియోగదారులకు పథకం ప్రయోజనాలను వివరించారని చెప్పారు. జిల్లాలోని 42 మంది విక్రేతలు ప్రతి నెల కనీసం 50 సౌర ప్యానెల్లు, ఇన్వర్టర్లను ఏర్పాటు చేసేలా లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగంతో ఆర్థిక ప్రయోజనాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతిపై ఢిల్లీలో మంత్రి పయ్యావుల ప్రసంగం



ఢిల్లీ/అనంతపురం మహి న్యూస్ సెప్టెంబర్ 19: వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన ఆర్థిక వ్యూహాలు, పెట్టుబడుల సమీకరణ, రాష్ట్రాల ఆర్థికాభివృద్ధిపై ఢిల్లీలో నిర్వహిస్తున్న సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరుగుతున్న 'వికసిత్ భారత్ దిశగా భారత ఆర్థిక ప్రయాణం' సదస్సులో మంత్రి పయ్యావుల కేశవ్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల వాతావరణంపై ప్రసంగించారు. పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంచడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు.

## కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం





అనంతపురం మహి న్యూస్ సెప్టెంబర్ 19: మూడో శనివారం సందర్భంగా అటవీశాఖ సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాల్లోని చెత్తను తొలగించి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరత్న, సిబ్బంది, అటవీశాఖ ఇన్‌చార్జి రేంజ్ అధికారి దీపా, సెక్షన్ అధికారులు గౌతమి, నీలవేణి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా -2026 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 19: జిల్లాలో స్వచ్ఛతా హి సేవా – 2026 కార్యక్రమం అమలుపై జిల్లాలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు మరియు మున్సిపల్ సిబ్బందితో శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లు మరియు కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశించిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో స్పష్టమైన, శాశ్వతమైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన మరియు ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ శాఖలు, క్షేత్రస్థాయి సిబ్బంది మరియు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య నిర్వహణలో శాశ్వతమైన మెరుగుదలలు సాధించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్వహించిన కార్యక్రమాలను సమగ్రంగా డాక్యుమెంట్ చేసి, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన తిరుపతి జిల్లా సాధన దిశగా స్వచ్ఛతా హి సేవా– 2026ను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## మనోబంధు ఫౌండేషన్ 5వ వార్షికోత్సవం...



మహి న్యూస్,: మనోబంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ భూపతి రాజు రామకృష్ణ మరాజు అధ్యక్షత వహించగా, మనోబంధు సేవా కార్యక్రమాలు రాయలసీమ మరియు ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలలో జరిగిన విషయాలను కులం కుశంగా తెలియజేశారు. మనదేశంలో పల్లెలలోనైనా పట్టణాలలోనైనా నగరాలలోనైనా ఎక్కడ చూసినా మానసిక రుగ్మతలతో బాధపడుతూ ఆదరించేవాడు ఎవరూ లేక నిరాశ్రయులై రోడ్లపై తిరుగుతున్న మనుషులను అక్కున చేర్చుకుంటున్న మనోబంధు ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాలలో దాదాపు 400 మందిని చేరదీసి వారికి మానసిక వైద్యశాలలో ఆరోగ్య సౌకర్యం కల్పించి వారిని తిరిగి కొంతమందిని వారి కుటుంబ సభ్యులతో కలపడం చాలా సంతోషంగా ఉందని, విశాఖపట్నం మెడికల్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ సెక్రటరీ గౌరవ వీర పాండియన్ ఐఏఎస్ ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రంలోనే అద్భుతమైన సేవ చేయడం పప్రథమము. ప్రభుత్వం తరపున ఇది మా యొక్క సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మనోబంధు ఫ్రంట్ లైన్ సేవకులకు మెమెంటోలు అందజేశారు. మనో బంధు సేవలను గురించి డాక్టర్ పి లోకేష్ రెడ్డి సైక్రియాటిస్ట్ సేవలను గురించి కూలంకుశంగా, ఇటువంటి మహోన్నతమైన కార్యక్రమానికి మా యొక్క సహకారము ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు. డాక్టర్ ఫౌండర్ ఇండ్ల హాస్పిటల్స్, ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మనోబంధు సేవలు విశిష్టమైనవి గౌరవింపదగినవి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, చైర్మన్ వై.డి.రామారావు, గోతాల బాబా, ఉన్నత విద్యావంతుడు సేవకుడు మాట్లాడుతూ మన బంధు సేవలు గురించి మొట్టమొదటిగా మనో బంధు సేవలు గురించి నా యొక్క వ్యక్తిగత అనుభూతిని తెలియజేస్తాను. అంటే అనారోగ్య మానసిక ఆడపిల్లల పరిస్థితి చెప్పనలివి తీరని కాదు. చివరగా డా. ముచ్చుకోట సురేష్ బాబు మనో బందు ఫౌండేషన్ గురించి మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కళాశాలల ఎన్ఎస్ఎస్, ఎన్సిసి, స్కౌట్, యూనివర్సిటీ విద్యార్థులతోపాటు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించి వారిని మనోబంధు ఫౌండేషన్ సభ్యులుగా చేర్చుకొని మానసిక అభాగ్యులను గుర్తించే ఏర్పాటు చేసి విస్తృతం చేసే విధంగా ప్రణాళికలను రూపొందించాలని ఆయన తెలియజేశారు. తదనంతరం భోజనం ఏర్పాటు గావించడం జరిగినది.



## ధర్మ విజేత సంచిక ఆవిష్కరణ



హైదరాబాద్ మహి న్యూస్ సెప్టెంబర్ 19.: తెలంగాణ ప్రెస్ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస రెడ్డి గారు, ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రెస్ అకాడమీ చైర్మన్, సీనియర్ పాత్రికేయులు శ్రీ కె. రామచంద్ర రావు గారు కలిసి "ధర్మ విజేత" మాస పత్రిక సెప్టెంబర్ సంచికను ఘనంగా ఆవిష్కరించారు. సామాజిక చైతన్యం, విద్య, వ్యవసాయం, పర్యావరణం, కళలు, సినిమా, ప్రజా సమస్యలు వంటి విభిన్న అంశాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ సంచికలో అనేక ఆలోచనాత్మక, విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం కల్పించారు. 101 సంవత్సరాల వయస్సులోనూ సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తున్న శ్రీ చుక్కా రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన "అనంత ఆణిముత్యం" ప్రభాకర్ జీ, ప్రముఖ దర్శకులు శ్రీ బి. నరసింగరావు, స్వాతంత్ర్య సమరంలో తన సర్వస్వాన్ని ధారపోసిన చింతలచెరువు హంపమ్మ వంటి ప్రముఖుల జీవిత విశేషాలు, సేవలు, స్ఫూర్తిదాయక అంశాలను ఈ సంచికలో పరిచయం చేశారు. అలాగే సినిమా సమీక్షలు, సుమవనం స్కూల్, నేల క్షీణత, వరి ఉత్పత్తి పెరుగుదల, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులకు అందుతున్న ప్రతిభా స్కాలర్‌షిప్‌లు తదితర అంశాలపై ప్రత్యేక కథనాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు ఈ సంచికలో చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా "ధర్మ విజేత" ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "టి స్పార్క్ టీవీ" ప్రోమోను కూడా అతిథులు ఆవిష్కరించారు. మీడియా రంగంలో నూతన ఆలోచనలకు, సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు టి స్పార్క్ టీవీ వేదికగా కార్యక్రమాలను రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "టి స్పార్క్ టీవీ" తెలుగు బ్రాడ్ కాస్ట్ రంగంలో మంచి రూపకాలు ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో "ధర్మ విజేత" ఎడిటర్ డా. ఉద్దండం చంద్రశేఖర్, గౌరవ సంపాదకులు డా. ముచ్చుకోట సురేష్ బాబు, కరస్పాండెంట్ మరియు టి స్పార్క్ టీవీ సీఈఓ షేక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చింతల బజారులో పారిశుద్ధ్య కార్యక్రమాలు




జంగారెడ్డిగూడెం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా "స్వచ్ఛతే సేవను సమన్వయం చేస్తూ పారిశుద్ధ్య మరియు పరిశుభ్రత కార్యక్రమాలు" అనే అంశంతో జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలోని చింతల బజారులో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చింతల బజారు పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, రోడ్లు, వీధులు, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కే వెంకటరమణ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛత యొక్క ప్రాధాన్యతను వివరించి, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పురపాలక సిబ్బందికి సహకరించాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే వెంకట రమణ, సానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్. దుర్గాప్రసాద్, శానిటేషన్ సెక్రెటరీలు మరియు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా గ్రామీణ వారసత్వంపై సమగ్ర మోనోగ్రాఫ్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 19: తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని చారిత్రక, సాంస్కృతిక, పురావస్తు మరియు పర్యాటక ప్రాధాన్యత కలిగిన వారసత్వ సంపదను సమగ్రంగా నమోదు చేస్తూ రూపొందించిన "తిరుపతి జిల్లా గ్రామీణ వారసత్వం" మోనోగ్రాఫ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న 52 ముఖ్యమైన వారసత్వ, పర్యాటక మరియు పురావస్తు ప్రాధాన్యత కలిగిన కట్టడాలు, ప్రదేశాలు, నిర్మాణాలను ఈ మోనోగ్రాఫ్‌లో సమగ్రంగా నమోదు చేశారన్నారు. ఆయా ప్రాంతాల చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత, ప్రత్యేకతలతో పాటు అక్కడి వారసత్వ సంపదకు సంబంధించిన వివరాలను ఇందులో పొందుపరిచారని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, పర్యాటక ఆకర్షణలు, సంప్రదాయ నిర్మాణాలతో పాటు ఆయా ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంప్రదాయాలు, ఆచారాలు, సాంస్కృతిక అంశాలు, స్థానిక జీవన విధానం తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఈ మోనోగ్రాఫ్‌లో పత్రబద్ధీకరించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని చారిత్రక, సాంస్కృతిక మరియు పురావస్తు సంపదను గుర్తించి, వాటికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా సేకరించి, డాక్యుమెంట్ చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని గ్రామీణ వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు, దాని ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంలో ఇటువంటి ప్రచురణలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మోనోగ్రాఫ్ రూపకల్పనలో కృషి చేసిన జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి సంబంధిత సమాచారాన్ని సేకరించడం, సమన్వయం చేయడం, పరిశీలించడం మరియు పత్రబద్ధీకరించడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. ఈ మోనోగ్రాఫ్ అధికారులు, చరిత్రకారులు, పరిశోధకులు, విద్యార్థులు, పర్యాటకులు మరియు ప్రజలకు విలువైన సమాచార వనరుగా ఉపయోగపడనుందన్నారు. జిల్లాలోని గ్రామీణ వారసత్వ సంపదను పరిరక్షించడం, ప్రచారం చేయడం మరియు భవిష్యత్ తరాలకు అందించడంలో ఈ ప్రచురణ దోహదపడనుందని తెలిపారు. తిరుపతి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల చారిత్రక, సాంస్కృతిక, పురావస్తు మరియు పర్యాటక వైభవాన్ని వెలికితీసి, వాటిని సమగ్రంగా పత్రబద్ధీకరించడంలో ఈ మోనోగ్రాఫ్ ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, టూరిజం ఆర్ డి రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాధ్యం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 19: స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. పరిశుభ్రత అనేది కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం తిరుపతి ఎన్జీవో కాలనీలోని మాల్వాడిగుండం కాలువ వద్ద నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కాలువను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, స్వచ్ఛత ఉన్న చోటే ఆరోగ్యం, ఆరోగ్యం ఉన్న చోటే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి, నగర అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, అదే విధంగా మన వీధి, కాలనీ, నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ మాట్లాడుతూ, పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, సుందర నగరంగా నిలిపేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమష్టిగా కృషి చేయాలని కోరారు. నగర పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన నగరంగా తిరుపతిని నిలపడంలో యువత కీలక పాత్ర పోషించాలని, యువత ముందుకు వచ్చి స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని కార్యక్రమంలో పాల్గొన్న వారందరి చేత కమిషనర్ జయకృష్ణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, ఇంచార్జి జె.బి. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ కార్పొరేటర్ అన్నా అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు



అమరావతి, మహి న్యూస్, సెప్టెంబర్ 19: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి... అక్టోబర్ 1న కరువు మండలాలను ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కరువు మండలాలను గుర్తించడంతో పాటు ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్రానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావం, వ్యవసాయ--ఉద్యాన పంటల పరిస్థితి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, తాగునీటి సరఫరాపై క్యాంపు ఆఫసులో శనివారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఆరు శాఖల నుంచి అందే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని...వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, శాటిలైట్ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### 513 మండలాల్లో కరువు ఛాయలు

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరువు నెలకొందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగాను, 245 మండలాల్లో మోస్తరుగా ఉందన్నారు. కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల మార్గదర్శకత్వంలో క్షేత్ర స్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలిస్తాయని, అనంతరం వ్యవసాయ శాఖ క్షేత్ర పరిశీలన నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తుందని చెప్పారు. కరువు ప్రతిపాదనలను రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖకు జిల్లా కలెక్టర్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి సెప్టెంబర్ 24 చివరి తేదీగా నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను సెప్టెంబర్ 29న రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో పరిశీలిస్తారని తెలిపారు.

### ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం

ఉద్యాన పంటలు కాడటానికి ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షలో సీఎం అన్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావాన్ని కూడా అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 శాఖల పరిధిలో ఉన్న పంటలు హై రిస్క్ కేటగిరీలో ఉన్నాయన్నారు. ఎల్‌నినోతో 17,916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ) కింద రైతులకు సంబంధించిన నాలుగు కీలక సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ కింద అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చూడాలని సీఎం నిర్దేశించారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బందిపడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాగునీటికి బోర్లపైన ఆధారపడే ప్రాంతాలకు అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా చూడాలన్నారు. విశాఖ తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి విశాఖ తాగునీటి సరఫరా సంబంధిత పనులు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లు నింపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలన్నారు. మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ఎంసీ నుంచి ప్యాకేజీ నెం.8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలన్నారు. విశాఖ నగరానికి మరో 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

## కాకినాడ జిల్లా లో రక్తనిధి కేంద్రాల పనితీరు పై జిల్లా కలెక్టర్ కీలక ఆదేశాలు

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 19: జిల్లా లోని రక్తనిధి కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, అత్యవసర సమయాల్లో రోగులకు సురక్షితమైన రక్తం సకాలంలో అందేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు,జిల్లాలోని 12 రక్తనిధి కేంద్రాల ప్రతినిధుల తో రక్తనిధి కేంద్రాల పని తీరు,రక్త సేకరణ లక్ష్యాల సాధన,రక్త మార్పిడి సేవలు, రక్తనిధి కేంద్రాల నిర్వహణ, మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాలఅమలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి జిల్లా లోని 12 రక్త నిధి కేంద్రాలు నిర్దేశించిన రక్త సేకరణ లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. తుని ప్రాంతీయ ఆసుపత్రి లోని రక్తనిధి కేంద్రం మార్చి నెల నాటికి పూర్తిస్థాయిలో పనిచేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూ చించారు.కాకినాడ జీజీహెచ్ రక్తనిధి కేంద్రంలో ఉన్న పరికరాల కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లాలోని రక్తనిధి కేంద్రాలన్నీ నిర్దేశిత అనుమతులతో, నిబంధనలకు అనుగుణం గా నిర్వహించాలని, రక్త సేకరణ,పరీక్షలు,నిల్వ, పంపిణీ,రక్త మార్పిడి వంటి ప్రక్రియల్లో నిర్దేశిత భద్రతా, నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రక్తనిధి కేంద్రాల్లో రక్త నిల్వల పై ప్రత్యేక దృష్టి సారించి, వివిధ రక్త గ్రూపుల లభ్యత ను నిరంతరంపర్యవేక్షించా లని సూచించారు. రక్త సేకరణను పెంచేందుకు స్వచ్ఛంద రక్తదాన కార్య క్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సామాజిక సంస్థల సహకారం తో మరిన్ని రక్తదాన శిబిరాల ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.రక్త కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే గుర్తించి, అత్యవసర సమయాల్లో అవసరమైన రక్త గ్రూపు లు అందుబాటులో ఉం డేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు.. అదేవిధంగా ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అమలు చేస్తున్న సురక్ష కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వ హించాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, అవస రమైన వారికి కౌన్సెలింగ్, పరీక్షలు, ఏఆర్టి చికిత్సా సేవలు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రక్త నిధి కేంద్రాల కార్యక్ర మాలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను ప్రతి విభాగం నిర్దేశిత లక్ష్యాల మేరకు సాధిం చాలని స్పష్టం చేశారు. గత జూలై నెలలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో కాకినాడ జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు జిల్లా వైద్య ఆరోగ్య యంత్రాంగం చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తి తో రానున్న కాలంలోనూ కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో అవగాహన కల్పించాలని, సంబంధిత శాఖలు,రక్తనిధికేంద్రా లు, స్వచ్ఛంద సంస్థలు సమ న్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను అర్హులకు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ మహేశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎస్. చలమయ్య, డ్రగ్ ఇన్ స్పెక్టర్ మురళి, వైద్యులు స్రవంతి, రాజేశ్వరి,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాలాజీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు, రక్తనిధి కేంద్రాలప్రతినిధులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ఆలూరులో సెప్టెంబర్ 24న మెగా జాబ్ మేళా

**28 ప్రైవేటు కంపెనీల్లో 1,450 ఉద్యోగ ఖాళీలు**

**10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పీజీ అభ్యర్థులకు అవకాశం**



కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో 28 ప్రైవేటు కంపెనీల్లోని 1,450 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆలూరులోని బీజేఆర్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 24న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పీజీ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి మాట్లాడుతూ.. యువత జాబ్ మేళాను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. జాబ్ మేళాకు సంబంధించి సందేహాలు ఉంటే 9603303354, 9346243624 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 21న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**ఉదయం 9.30 గంటల నుంచి వినతుల స్వీకరణ**

**మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం**

కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 21వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించి వినతులను సమర్పించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## అర్జీ పరిష్కార స్థితిని 1100 ద్వారా తెలుసుకోవచ్చు

ప్రజలు ఇప్పటికే సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీ పరిష్కారం కాకపోయినా, ప్రస్తుతం ఏ దశలో ఉందనే సమాచారాన్ని కూడా 1100 ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రజలు తమ అర్జీలను మీకోసం వెబ్‌సైట్ (Meekosam.ap.gov.in) ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# కర్నూలు వినాయక ఘాట్ రూపాంతరంపై లోకేష్ ప్రశంసలు

**మంత్రి టీజీ భరత్, కలెక్టర్, కమిషనర్ కృషికి అభినందనలు**

**అధికార యంత్రాంగాన్ని అభినందించిన మంత్రి నారా లోకేష్**



కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ అభివృద్ధి, రూపాంతరంపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. గతంలో చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంతాన్ని పరిశుభ్రమైన, సుందరమైన వినాయక ఘాట్‌గా తీర్చిదిద్దడంపై మంత్రి అభినందనలు తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వినాయక ఘాట్ వద్ద గత నాలుగు నెలలుగా చేపట్టిన పారిశుద్ధ్య, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రత్యేక వీడియోను శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఈ వీడియోను శనివారం మంత్రి నారా లోకేష్ తన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పంచుకున్నారు. కేంద్రీకృత పాలనతో పాటు ప్రాథమిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఎలాంటి మార్పు సాధ్యమవుతుందో కర్నూలు వినాయక ఘాట్ రూపాంతరం చూపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్పు కోసం కృషి చేసిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో పాటు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. రాజకీయ నాయకత్వం, స్థానిక పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే ప్రజా ప్రదేశాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చని నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశుభ్రంగా మారిన ప్రజా ప్రదేశాలను భవిష్యత్తులో కూడా అదే విధంగా కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ మార్పును కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## నాలుగు నెలల్లో రూపాంతరం

కమిషనర్‌గా చల్లా ఓబులేసు బాధ్యతలు స్వీకరించిన అనంతరం వినాయక ఘాట్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. జేసీబీలతో పెద్ద ఎత్తున చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు ఘాట్ వద్ద సీసీ రహదారి, మెట్లు, బండ్, డ్రెయిన్, రాతి నిర్మాణాలు, ఫెన్సింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి, ఘాట్ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. కెనాల్‌లో చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు చెత్త సేకరణ ట్రాలీలను అందుబాటులో ఉంచారు. దీంతో గతంలో చెత్తాచెదారంతో నిండిపోయిన ప్రాంతం ప్రస్తుతం పరిశుభ్రంగా, సుందరంగా రూపాంతరం చెందింది. ఈ మార్పుకు సంబంధించిన వీడియోను నగరపాలక సంస్థ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా, మంత్రి నారా లోకేష్ దాన్ని తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకుని అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు**

**మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి**

**హెల్మెట్, వేగ నియంత్రణ, మద్యం సేవించి డ్రైవింగ్‌పై అవగాహన**



కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): జిల్లాలో రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రతి శనివారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ప్రజలతో సమావేశాలు నిర్వహించి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను





అతివేగంగా నడపకూడదని, అధిక బరువుతో ప్రయాణించకూడదని పోలీసులు వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున మద్యం సేవించి వాహనం నడపవద్దని ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించుకోవచ్చని పోలీసులు అవగాహన కల్పించారు.

# ఈ నెల 21లోపు పెన్షన్ దరఖాస్తుల ఆమోదం పూర్తి చేయాలి

**పెండింగ్ దరఖాస్తులు, ఫోటో మానిటరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి**




కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): ఈ నెల 21లోపు పెన్షన్ దరఖాస్తుల పరిశీలన, ఆమోద ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి అధికారులను ఆదేశించారు. శనివారం పెన్షన్లు, ఎస్ఈఆర్ ప్రక్రియ, స్వచ్ఛతా హీ సేవా, అక్షరాంధ్ర తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పెన్షన్ మంజూరు కోసం 52,894 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిలో 20,186 దరఖాస్తులను ఇంకా పరిశీలించి ఆమోదించాల్సి ఉందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, సంబంధిత జిల్లా




అధికారులు దరఖాస్తులను పరిశీలించి వారి లాగిన్‌ల నుంచి ఆమోదం తెలిపి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లకు పంపించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లకు చేరిన దరఖాస్తులను కూడా ఆలస్యం చేయకుండా పరిశీలించి ఎప్పటికప్పుడు సెర్ప్ సీఈవో, సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్, ఆదోని రూరల్, కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో పెండింగ్ ఎక్కువగా ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## ఎస్ఈఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

ఎస్ఈఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఫారాలను, ఫోటో మానిటరింగ్ ప్రక్రియను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బీఎల్ఓ, ఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫోటో మానిటరింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించి సున్నా స్థాయికి తీసుకురావాలని ఈఆర్ఓలను ఆదేశించారు. 22ఏకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను మంగళవారం నాటికి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్డీఓలను ఆదేశించారు.

## అక్షరాంధ్రలో హాజరు పెంచాలి

అక్షరాంధ్ర కార్యక్రమంలో వాలంటీర్లు, అభ్యాసకుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. హాజరు నమోదు చేయడంతో పాటు తరగతులను నిరంతరాయంగా నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అభ్యాసకుల హాజరు మెరుగ్గా ఉన్న హాలహర్వి మండలంలో అనుసరిస్తున్న విధానాన్ని ఇతర మండలాలు కూడా అమలు చేయాలని సూచించారు. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఎమ్మిగనూరు అర్బన్, కౌతాళం, పత్తికొండ తదితర ప్రాంతాల్లో అభ్యాసకుల హాజరు తక్కువగా ఉన్నందున దాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పరిశుభ్రత లక్ష్య ప్రాంతాలు, చెత్తకు అవకాశం ఉన్న ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, క్రీడా మైదానాలు, ప్రజా మరుగుదొడ్లు, నీటి వనరులు, కాలువలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో వినాయక ఘాట్లు, మండపాలు, నీటి వనరులు, కాలువల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని ఫోటోలతో సహా సంబంధిత వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి వార్డుకు నోడల్ పారిశుద్ధ్య కార్యదర్శి లేదా నోడల్ అధికారిని నియమించి వారి



ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీపీఓ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ రెడ్డి, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎంపీడీవోలు, ఈఓఆర్‌డీలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌లు

**పీఎం సూర్యఘర్ పథకం కింద 23,077 రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యం**

**ఇప్పటికే 17,331 ఇళ్లలో ఏర్పాటు..**

**మిగిలిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి**



కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి తెలిపారు. శనివారం కల్లూరు మండలం ఏ. గోకులపాడు గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకం కింద శిరోమణి ఇంటిపై యూఎల్‌ఏ విధానంలో, శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై క్యాపెక్స్ విధానంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్‌లను



కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సోలార్ విద్యుత్ ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 23,077 యూఎల్‌ఏ విధానంలోని సోలార్ రూఫ్‌టాప్‌లను ఉచితంగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 17,331 రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసి 75 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు వెల్లడించారు. మిగిలిన 25 శాతం లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పథకం వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తున్నట్లు తెలిపారు. క్యాపెక్స్ విధానంలో సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గరిష్టంగా రూ.78 వేల వరకు రాయితీ అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ విధానంలో ఇప్పటివరకు 4,300 సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 3,869 మంది లబ్ధిదారులకు రూ.29 కోట్ల మేర రాయితీ అందించినట్లు వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా దశలవారీగా రాయితీ మొత్తం అందుతుందని తెలిపారు. ఏ. గోకులపాడు గ్రామంలో శిరోమణి ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్‌ను పరిశీలించిన కలెక్టర్.. గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు సౌర ప్యానెళ్లను ఏర్పాటు చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 87 రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా సౌర ప్యానెళ్ల ఏర్పాటుకు అనువైన ఇళ్లను గుర్తించి, అర్హులైన కుటుంబాలకు వీలైనంత త్వరగా సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై క్యాపెక్స్ విధానంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్‌ను పరిశీలించే సమయంలో లబ్ధిదారులు విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గిందని కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.. సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుతో అధిక విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న కుటుంబాలకు బిల్లుల భారం తగ్గే అవకాశం ఉందన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌ల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, మరింత మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

## బి-క్యాంప్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

అనంతరం కర్నూలు నగరంలోని బి-క్యాంప్‌లో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి పరిశీలించారు. జిల్లాలో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అంశాలను విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి అరోరా నగర్, మిలటరీ కాలనీ, బి-క్యాంప్, సి-క్యాంప్, గాయత్రీ ఎస్టేట్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో విజ్ఞాన



మందిరం, హౌసింగ్ బోర్డు, అరోరా నగర్ తదితర ప్రాంతాలకు సంబంధించిన 11 కేవీ ఫీడర్లు ఉన్నట్లు వివరించారు. 220 కేవీ నుంచి 33 కేవీకి, అనంతరం 33 కేవీ నుంచి 11 కేవీకి విద్యుత్‌ను తగ్గించి, స్థానిక పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా 11 కేవీ విద్యుత్‌ను 440 వోల్టులకు మార్చి వినియోగదారులకు సరఫరా చేసే విధానాన్ని సబ్‌స్టేషన్‌లోని పరికరాలను చూపిస్తూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో మార్పునకు ప్రజలే కీలకం

**బల్క్ వేస్ట్ జనరేటర్లు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి**

**నెల రోజులపాటు జిల్లాలో విస్తృతంగా స్వచ్ఛత కార్యక్రమాలు**

**చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు**

**జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిణి డా. ఏ. సిరి**

కర్నూలు, సెప్టెంబర్ 19: (మహి న్యూస్): జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అధికార యంత్రాంగం వినూత్న ఆలోచనలతో పనిచేస్తోందని, స్వచ్ఛతలో శాశ్వత మార్పు తీసుకురావడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిణి డా. ఏ. సిరి తెలిపారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీఓ సందీప్ కుమార్‌తో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, తడి--పొడి చెత్తను వేర్వేరుగా అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే స్వచ్ఛతలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. మన నగరం, మన ఆరోగ్యం కోసం స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బల్క్ వేస్ట్ జనరేటర్లకు సూచనలు

బల్క్ వ్యర్థాల ఉత్పత్తిదారులకు ఇప్పటికే అవగాహన కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. వారు తమ వ్యర్థాలను తామే ప్రాసెస్ చేసుకునేలా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పర్యావరణంపై ప్రభావం పడుతుందని, వ్యర్థాలు చివరకు ఎక్కడికి చేరుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గార్గేయపురం డంప్‌యార్డులో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్, సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులను కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే పరిశుభ్రత అలవాటుగా మారేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రిబుల్ ఆర్ కేంద్రాల వినియోగం, వ్యర్థాల వేరు చేయడం, పునర్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

## నెల రోజులపాటు విస్తృత కార్యక్రమాలు

కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలో నెల రోజులపాటు వివిధ స్వచ్ఛత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, యువత, పారిశుద్ధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన




పెంచడంతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. నగరంలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. చెత్తకు అవకాశం ఉన్న ప్రాంతాలను దశలవారీగా తొలగించి పరిశుభ్రమైన ప్రాంతాలుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకపోవడం, ట్రిబుల్ ఆర్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛత కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలని కమిషనర్ సూచించారు. పరిశుభ్రమైన నగరం కోసం మార్పును ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే ప్రారంభించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో కర్నూలు నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దగలమన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా. ఎం. రఘు, పారిశుద్ధ్య సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు ఫరూక్, జిలాని, స్వచ్ఛ సర్వేక్షణ్ సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కడప జైళ్లలో న్యాయ సేవలపై పరిశీలన

## ఖైదీలకు వీల్‌చైర్లు, వాకర్లు, వినికిడి యంత్రాల పంపిణీ



కడప, మహి న్యూస్, సెప్టెంబర్ 19: కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామగోపాల్, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి కేసులు, ఆరోగ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరును పరిశీలించి, ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలపై ఆరా తీశారు. ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల వ్యవస్థపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యులు సూచించిన మందులను సకాలంలో అందించాలని సూచించారు. జైలు పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. న్యాయ సేవల సహాయవాణి 15100పై ఖైదీలకు అవగాహన కల్పించారు. అనంతరం అవసరమైన ఖైదీలకు వీల్‌చైర్లు, వాకర్లు, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్ కుమార్, రాయచోటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నూతనగంటి తేజస్విని, రెండు కారాగారాల సూపరింటెండెంట్లు, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, ఖైదీలు పాల్గొన్నారు.







# పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతుల పరిశీలన

## కేంద్ర పరిశీలకులు రజత్ కుమార్ షైనీ ఆకస్మిక తనిఖీ





కడప, మహి న్యూస్, సెప్టెంబర్ 19: కడప జిల్లా ఒంటిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల, వల్లూరులోని ఏపీ మోడల్ స్కూళ్లలో పీఎం శ్రీ పథకం కింద అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులను కేంద్ర పరిశీలకులు, ఎన్ఐసీడీసీ సీఈఓ, ఎండీ రజత్ కుమార్ షైనీ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలల్లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు, కిచెన్ గార్డెన్, సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, క్రీడా మైదానం, సౌర విద్యుత్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, ఆరోగ్య గది, పీఏఎల్ఎల్ ప్రయోగశాల, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాలు, గ్రంథాలయం తదితర సుమారు 21 రకాల మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యతో పాటు సహపాఠ్య కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల లక్ష్యాలకు అనుగుణంగా అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీమాట్ డైరెక్టర్ ప్రసన్న కుమార్, లెక్చరర్లు ప్రసాద్ రావు, సురేష్ కుమార్, పుల్లట రమేష్, ఆర్జేడీ శామ్యూల్, జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డి.మహేశ్వర్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు అన్ని వసతులు కల్పించడమే లక్ష్యం : సుధాకర్




రాయచోటి, మహిన్యూస్ సెప్టెంబర్ 19 : ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అందించడమే తమ ప్రభుత్వ విధానమని రాయచోటి రూరల్ మండలాధ్యక్షులు గండికోట సుధాకర్ అన్నారు. రాయచోటిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితమే పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తాము పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని అన్నారు. రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి కాలనీ సమగ్రంగా సర్వే చేయించి నిజమైన లబ్ధిదారునికి పక్కా గృహాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే మంత్రి అందరికీ ఇల్లు పథకం కింద గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు పేదలకు ఉచితంగా స్థలాలు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతి మనిషికి సొంత ఇల్లు అనేది ఒక కళ అని ఆ కళను సాకారం చేయాలనేదే మంత్రి మండిపల్లి లక్ష్యమన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు విత్తన గుళికలతో పీఎండీఎస్ సాగు

## జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్

గాలివీడు:సెప్టెంబర్19(మహి న్యూస్): ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు విత్తనాలను గుళికలుగా తయారు చేసి విత్తడం వల్ల వాటికి రక్షణ లభించి ఎల్ నినో పరిస్థితులను తట్టుకొని మొలక ఎత్తుతాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి వెంకట మోహన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలం లోని గోపనపల్లి వీవో పరిధిలో రైతు ఇరుగుమ్ రెడ్డి గారి 5.00 ఎకరాల పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అనుములు, పెసలు, అలసంద, మొక్కజొన్న, సజ్జలు, కొర్రలు తదితర పంటల విత్తనాలతో విత్తన గుళికలు తయారు చేసి పొలంలో వేశారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి రైతు బీడు భూముల్లో విత్తనాలు విత్తుకునే విధంగా చూడాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న రాయితీ ద్వారా ఉలవల విత్తనాలను తీసుకుని, వాటితో పాటు అలసంద, అనుములు, మేత జొన్న వంటి పంటలను విత్తన గుళికలుగా తయారు చేసి ప్రతి రైతు బీడు భూముల్లో విత్తుకోవాలని ప్రకృతి వ్యవసాయ సభ్యులకు సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ మరియు ప్రకృతి వ్యవసాయ సమితి సమన్వయంతో ప్రతి రైతు బీడు భూముల్లో విత్తనాలు విత్తుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.టి. వెంకట జ్యోతి, ఆర్ఎస్‌కే సిబ్బంది ప్రకృతి వ్యవసాయ సమితి సభ్యులు పాల్గొన్నారు.



గోపన పల్లెలో వ్యవసాయ భూములు విత్తనాలను వేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

# స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికే స్ఫూర్తిదాయకం..!

## ఎన్ఐసీడీసీ సీఈఓ, ఎండీ రజత్ కుమార్ సైనీ ప్రశంసలు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన పోషకాహారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ కు ప్రశంసలు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 19: విద్యార్థులకు నాణ్యమైన, శుచికరమైన, పోషకాహారాన్ని అందించేందుకు కడప జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ విధానం దేశానికే స్ఫూర్తిదాయకంగా ఉందని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) సీఈఓ, ఎండీ రజత్ కుమార్ సైనీ ప్రశంసించారు. శనివారం వల్లూరు మండలం గంగాయపల్లె పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న స్మార్ట్ కిచెన్‌ను రజత్ కుమార్ సైనీ, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి లతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వారి వెంట జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌లో ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, విద్యార్థులకు భోజనం సరఫరా తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్మార్ట్ కిచెన్ నుంచి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రజత్ కుమార్ సైనీ స్వయంగా రుచిచూశారు. భోజనం చాలా రుచికరంగా ఉందని, నాణ్యమైన వస్తువులను ఉపయోగించి ఆహారాన్ని తయారు చేయడం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు రుచితో పాటు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు అందేలా భోజనం సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణ విధానం ఎంతో ఆకట్టుకునేలా ఉందని ఆయన పేర్కొంటూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు ఇలాంటి వినూత్న విధానాన్ని అమలు చేయడం మంచి పరిణామమన్నారు. వినూత్న ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన అభినందించారు. ఆహార తయారీ నుంచి విద్యార్థులకు అందించే వరకు పరిశుభ్రత, నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేడి, పరిశుభ్రమైన, నాణ్యమైన పోషకాహార మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, భోజన సమయాన్ని విద్యార్థుల్లో మంచి అలవాట్లను పెంపొందించే అభ్యాస ప్రక్రియగా మార్చేందుకు ఏఎన్‌టీఏస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. చేతులు శుభ్రం చేసుకోవడం, క్రమపద్ధతిలో భోజనం చేయడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, భోజనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నామని వివరించారు. స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆహార తయారీ, సరఫరా ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# కొప్పర్తి పారిశ్రామిక ప్రాంత పనులు గడువులోగా పూర్తి చేయాలి..!

## ఎన్ఐసీడీసీ సీఈఓ రజత్ కుమార్ సైని రూ.1,006 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేయాలి

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 19: కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతంలో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూలమైన ప్రపంచస్థాయి వసతులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ రజత్ కుమార్ సైని తెలిపారు. శనివారం కడప సమీపంలోని కొప్పర్తి ఎన్ఐసీడీసీ పారిశ్రామిక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ డా. నిధిమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావనలతో కలిసి రజత్ కుమార్ సైని పరిశీలించారు. పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను పరిశీలించిన అనంతరం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పనుల పురోగతిని సమీక్షించారు. వివిధ పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొప్పర్తి దక్షిణ భాగంలో 2,595.74 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచస్థాయి పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులోని అన్ని పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం ద్వారా సుమారు రూ.8,860 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండగా, దాదాపు 54,500 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. మొత్తం రూ.1,006 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో మౌలిక వసతుల పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో 51 కిలోమీటర్ల అంతర్గత రహదారులు, 93 కిలోమీటర్ల వర్షపు నీటి పారుదల వ్యవస్థ, 63 కిలోమీటర్ల తాగునీటి సరఫరా పైపులైన్లు, 15 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా 64 కిలోమీటర్ల మురుగునీటి తరలింపు వ్యవస్థ, 2 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం, 2 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఉమ్మడి వ్యర్థజల శుద్ధి కేంద్రం, 52 కిలోమీటర్ల విద్యుత్ తీగల మార్గాలు, 220 కేవీ, 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, వంతెనలు, ఇతర అవసరమైన పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో చేపట్టిన ప్రతి పనిని సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రాజెక్టు లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించేలా చర్యలు తీసుకోవాలని రజత్ కుమార్ సైని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళి, ఏపీఐఐసి డిప్యూటీ జెడ్ఎం కమలాకర్, పరిశ్రమల శాఖ అధికారులు, కొప్పర్తి పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి

## ఆరు గ్రామాల రైతులకు తక్షణమే నీరు అందించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ డిమాండ్.

గాలివీడు:సెప్టెంబర్19(మహి న్యూస్): వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా సాగునీరు అందించి రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మావులూరి విశ్వనాథ్, బందెల ఓబయ్య, సిగి చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గాలివీడు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా దూర ప్రాంతాలకు సాగునీరు అందించడం మంచిదేనని, అయితే ప్రాజెక్టుకు సమీపంలోని రైతాంగాన్ని కూడా ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వారు కోరారు. గోరాన్ చెరువు, ఎగువ గొట్టివీడు, దిగువ గొట్టివీడు, మాధవరం, గొర్లమదీడు, ఎండపల్లి గ్రామాలకు చెందిన చెరువులు, కుంటలకు వెలిగల్లు ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ ప్రాంతాల్లో వ్యవసాయం కోసం రైతులు లక్షలాది రూపాయలను అప్పులు చేసి బోర్లు వేస్తున్నప్పటికీ, 1,000 నుంచి 1,400 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు లభించడం లేదని తెలిపారు. నీరు పడిన బోర్లలోనూ నిరంతరం నీరు అందుతుందనే గ్యారెంటీ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కనీసం తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. సాగునీరు లేక వరి, వేరుశనగ, టమోటా తదితర పంటలు ఎండిపోతున్నాయని, వ్యవసాయంపై ఆధారపడిన రైతులు అప్పుల భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో అనేక మంది రైతులు, కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఈ ఆరు గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటలకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి, ప్రతి గుంటకు కనీసం నెలకు ఒకసారైనా నీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సాగునీటి కోసం జరిగే పోరాటానికి పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా రైతులంతా కలిసిరావాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు,



# కుమ్మరపల్లె చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



రామాపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామాపురం మండలం కుమ్మరపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామంలో చెత్త సేకరణ, తరలింపు, వ్యర్థాల నిర్వహణ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని తడి, పొడి చెత్తను వేరు చేస్తున్న విధానం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, వర్మీ కంపోస్టింగ్ ప్రక్రియ ప్రారంభం, అందుకు చేపట్టిన చర్యలపై వివరాలు సేకరించారు. గ్రామపంచాయతీ పరిధిలోని హ్యాబిటేషన్ల సంఖ్య, ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతిరోజూ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సేవలు, ఇంటింటి చెత్త సేకరణలో వారి భాగస్వామ్యం, చెత్తను యార్డుకు తరలించే విధానం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా క్రమం తప్పకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను సాధ్యమైనంత వరకు మూలస్థాయిలోనే వేరు చేసి, పునర్వినియోగానికి అనువైన పదార్థాలను వేరు చేయడంతో పాటు, సేంద్రియ వ్యర్థాలతో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో పరిశుభ్రమైన వాతావరణం, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, తాసిల్దార్ , మండల స్థాయి సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



రామాపురం, మహి న్యూస్, సెప్టెంబర్ 19: రామాపురం మండలం కుమ్మరపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, డిజిటల్ విద్యా సదుపాయాల వినియోగాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. గణితం, ఆంగ్లం సబ్జెక్టుల్లో విద్యార్థుల అవగాహనను పరీక్షించారు. గణిత సమస్యలను విద్యార్థులకు అందించి వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారో పరిశీలించారు. అదేవిధంగా ఆంగ్లంలో ఇచ్చిన వాక్యాలను వివిధ కాలాల్లోకి మార్చే విధానంపై విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును పరిశీలించిన కలెక్టర్, దాని ద్వారా విద్యార్థులకు బోధన జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. డిజిటల్ బోర్డు నిర్వహణ, వినియోగంపై ఉపాధ్యాయులకు ఉన్న అవగాహనను కూడా పరిశీలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాబోధనలో సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల పై మరింత దృష్టి సారించి వెనుకబడిన సబ్జెక్టుల్లో మెరుగుపడే విధంగా కృషి చేయాలని , ఈ విషయమై ఉపాధ్యాయులు అలసత్వం వహిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ పనులు, వాటి ప్రస్తుత పరిస్థితిపై వివరాలను సేకరించి సమగ్ర నివేదికను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదో తరగతి విద్యార్థులకు నిరంతరం అభ్యాసం కల్పిస్తూ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, తాసిల్దారు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com